

ఉమెన్ సేఫ్ హావెన్ పరిశీలన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో రుడా ఆధ్వర్యాన నిర్మించిన జగన్ అన్న ఉమెన్స్ సేఫ్ హావెన్‌ను నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, మహిళ కౌన్సిలర్లు గురువారం సందర్శించారు. అనంతరం రుడా ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డిని కలిసారు. సేఫ్ హావెన్‌ను ఆడపిల్లల భద్రత గురించి నిర్మించినట్టు షర్మిళరెడ్డి తెలిపారు. వారికి తగిన షెల్టర్లను, టాయిలెట్స్, ఎటిఎంలు, సదుపాయాలు కల్పించాలని తెలిపారు. వారి భద్రత నిమిత్తం ఒక పోలీస్ అవుట్ పోస్ట్‌ను కూడా ఇందులో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిడదవోలులో కూడా జగన్ అన్న ఉమెన్స్ సేఫ్ హావెన్ వంటి ఏర్పాటు చేయాలని షర్మిళ రెడ్డిని వారు కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు.

చితికి పోతున్న లారీ పరిశ్రమ

- పెరిగిన డీజిల్, టైర్ల ధరలు
- మరోవైపు గ్రీన్ ట్యాక్స్‌తో దోపిడీ
- యజమానులు, డ్రైవర్ల అవస్థలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ విధానాలు, మరో వైపు కరోనా కాలంలో ఎదురైన నష్టాలతో లారీ పరిశ్రమకు పూర్తిగా కుదేలయ్యింది. పెరిగిన డీజిల్ ధరలు, టోల్ గేటు ధరలతో పాటు అదేస్థాయిలో వాటి బాడుగల ధరలు పెరగకపోవడంతో లారీ రంగంలో పనిచేసే వారంతా వేర్వేరు రంగాలకు వలస వెళ్లిపోతున్నారు. ఎనిమిదేళ్ల కాలంలో డీజిల్ ధరలు పెరిగిన స్థాయిలో కిరాయిలకు బాడుగలు పెరగడం లేదు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి వాటికి తెచ్చిన వడ్డీలకు కూడా వస్తున్న ఆదాయం గిట్టుబాటు కావడం లేదు. ఆస్తులు, భూములు, ఇతర వాటిని బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్సల్లో తెచ్చిన అప్పులు పెరిగిపోతుండడంతో భయంతో యజమానులు లారీలను నష్టాలకు అమ్ముకుంటున్నారు. ఒకప్పుడు నాలుగైదు లారీలతో దర్జాగా బతికిన వారు సైతం వాటిని తెగనమ్మి తెచ్చిన అప్పులు తీరక బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్సలు వేసిన కేసులతో కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నారు. పెద్దఎత్తున లారీలను తెగనమ్ముకోవడంతో ఈ పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు లారీలతో కళకళలాడిన ఉభయ గోదావరి జిల్లాలు నేడు వెలవెలబోతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

డీజిల్ ధర పెరిగినా పెరగని బాడుగలు

2016లో డీజిల్ ధర రూ.52.28, బాడుగ టన్నుకు రూ.1300 నేడు డీజిల్ రూ.99.58 బాడుగ రూ.1350 ఉంది. అంటే ఆరేళ్లలో డీజిల్ ధర రూ.47.30 పెరగగా బాడుగ ధర మాత్రం టన్నుకు రూ.50 రూపాయలు మాత్రమే పెరిగింది. తరచుగా పెరుగుతున్న డీజిల్ ధరలతో ఒక్కో లారీ యజమాని నెలకు వేలకు వేలు అదనంగా నష్టపోతున్నాడు. సాధారణంగా ఒక్కో లారీ నెలకు 3 వేల కిలోమీటర్లు తిరుగుతోంది. దీన్ని బట్టి చూస్తే పెరిగిన డీజిల్ ధరలకు పెరగని బాడుగల వల్ల నెలకు లారీపై రూ.50 వేల వరకు నష్టం వాటిల్లుతోంది.

ఈ మధ్యకాలంలో టోల్‌గేటు ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. గతంలో ఉన్న టోల్‌గేటు ధరలకు అదనంగా రూ.60 నుంచి రూ.200 వరకు పెరిగాయి. రోడ్లను బట్టి టోల్ ధరలు కూడా ఉంటున్నాయి. పెరిగిన టోల్ ధరలు లారీ యజమానులకు భారంగా పరిణమిస్తున్నాయి. ధరలు తగ్గించాలని ఆందోళనలు సైతం చేపట్టారు. ఏడాదికి టోల్‌ల సంఖ్యకూడా పెరిగింది. పదుల సంఖ్యలో పెరుగుతున్న టోల్‌వల్ల నెలకు ఒక్కొక్క లారీకి రూ.10 నుంచి రూ.15 వేల వరకు భారం పడుతోంది. మరోవైపు టైర్ల ధరలు కూడా పెరుగుతున్నాయి. నెలరోజుల క్రితం రెండు టైర్లు రూ.42 వేలు ఉండగా ప్రస్తుతం రూ.48 వేలు దాటాయి. సాధారణంగా టైర్ల జీవిత కాలం 80వేల కిలోమీటర్లు. కానీ రోడ్డు దెబ్బతినడం వల్ల ఏప్పుడు పగిలిపోతాయోననే భయం యజమానుల్లో ఏర్పడుతోంది.

గ్రీనట్యాక్స్ పేరుతో మరో దోపిడీ

గ్రీన ట్యాక్స్ పేరుతో ప్రభుత్వం లారీ యజమానులను నిలువుదోపిడీ చేస్తోంది. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరలు, పెరగని బాడుగలతో సతమతమవుతుంటే అదనంగా గ్రీన ట్యాక్స్‌ను వసులు చేస్తుండటంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలకు ఒకసారి 12, 14 టైర్ల లారీలకు రూ.12,500 రూపాయలు, 16 టైర్ల లారీలకు రూ.15000 చొప్పున చెల్లించాల్సి వస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాలో 5 వేలకు పైగా లారీలు ఉండేవి. ఆహార ఉత్పత్తులతో పాటు ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సరుకుల అధిక శాతంగా ఉమ్మడి జిల్లా నుంచి ఎగుమతులు, దిగుమతులు జరిగేవి. ఈ రంగంలో యజమానులే డ్రైవర్లుగా ఉపాధి పొందే వారు అధిక సంఖ్యలో ఉన్నారు. కరోనా వైరస్ విజృంభణను నియంత్రించేందుకు అమలు చేసిన లాక్‌డౌన్ ఫలితంగా ఈ పరిశ్రమ పూర్తిగా దెబ్బతింది. కరోనా తగ్గుముఖం పట్టినా పెరిగిన డీజిల్ ధరలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన 12 నెలలో బ్యాంకులకు కిస్తీలు చెల్లించలేక ఫైనాన్స్ కంపెనీలు వదిలేసిన యజమానులు పదుల సంఖ్యలో ఉన్నారు.

ఈ రంగాన్ని వదిలి వెళ్లిపోతున్నారు

జిల్లాలో ఒకప్పుడు వేలాది మందికి ఉపాధి చూపించిన ఈ పరిశ్రమ ప్రస్తుతం వెలవెల బోతోంది. గత 20 ఏళ్లుగా పూర్తి సంక్షోభం నెలకొంది. టైర్లు, డీజిల్ ఇతరత్రా విడిభాగాల ధరలు పెరిగిపోయాయి. ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన అనేక మంది ఇతర రంగాలకు తరలి వెళ్లిపోయారు. డ్రైవర్ల కొరత విపరీతంగా ఉంది. పదుల సంఖ్యలో లారీలు కొనుగోలు చేసి ఈ రంగంలో వందలాది మందికి ఉపాధి చూపిన వారు సైతం ఇపుడు లారీలను విక్రయించేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం లారీ పరిశ్రమను ఆదుకోవాలి. లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయాం. అనేక మంది లారీలను నడపలేక అమ్ముకుంటున్నారు.

- జి.సతీష్, మోరంపూడి జంక్షన్

రెండు లారీల్లో ఒకటి అమ్మేశా..

బాడుగలు లేక తనకున్న రెండు లారీల్లో ఒక లారీని అమ్మాను. బాడుగలు పెరగకపోవడంతోపాటు పెద్దఎత్తున డీజిల్, టైర్ల ధరలు పెరిగాయి. ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదు. అరకొర లాభాలు చేతి ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. బ్యాంకు వాయిదాలు కట్టలేకపోతున్నాం. పెరిగిన డీజిల్ ధరలకు అనుగుణంగా బాడుగలు పెంచడం లేదు. బాడుగలకు డిమాండ్ చేస్తే సరుకు ఇవ్వడం లేదు. అరకొర బాడులకు నడుపుకోలేక తెచ్చిన అప్పులు తీర్చలేక ఆందోళన చెందుతున్నాను.

- కె.వెంకటేశ్వరరావు, సీతంపేట



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

యాజమాన్యం తొత్తు ప్రవీణ్‌చౌదరి

విలేకరుల సమావేశంలో పేపరుమిల్లు కార్మిక సంఘాల జెఎసి నేతలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తన వ్యక్తిగత స్వలాభం కోసం కార్మికుల బతుకులను నాశనం చేసేలా పేపరుమిల్లు యాజమాన్యానికి తొత్తుగా గుర్తింపు సంఘం నాయకునిగా చెప్పుకుంటున్న చిట్టూరి ప్రవీణ్ చౌదరి వ్యవహరిస్తున్నారని ఏడు కార్మిక సంఘాలు, పర్మినెంట్ కార్మికుల జెఎసి ప్రతినిధులు విమర్శించారు. పేపరుమిల్లు ఎదురుగా ఉన్న సిఐటియు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జెఎసి పక్షాన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడారు. ఎపి పేపర్ మిల్లులో కార్మికులు చేస్తున్న పోరాటాన్ని వైసిపిలో అంతర్గత కుమ్ములాటలుగా చిత్రీకరించేందుకు చిట్టూరి ప్రవీణ్ చౌదరి ప్రయత్నిస్తున్నాడన్నారు. ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. యాజమాన్యానికి, చిట్టూరి ప్రవీణ్ చౌదరికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతున్నారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిల్లులోని ఏడు కార్మిక సంఘాలతోపాటు, పర్మినెంట్ కార్మికుల జెఎసి 12 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యాజమాన్యానికి ఇచ్చి 15 రోజులైనా ఏమాత్రం చలనం లేదన్నారు. ప్రవీణ్‌చౌదరి పెట్టిన మీడియా సమావేశంలోనే ఒక బాధితుడు ఒక పర్మినెంట్ కార్మికునికి రూ.7.50 లక్షలు ఇచ్చినట్టు ప్రకటించడం ద్వారానే పరంపర-2లో జరుగుతున్న అక్రమాలు తేటతెల్లం అయ్యాయన్నారు. పర్మినెంట్ కార్మికుడు తన ఉద్యోగాన్ని బయట వ్యక్తులకు అమ్ముకునేలా ఏమైనా చట్టం కొత్తగా వచ్చిందా అని ప్రశ్నించారు. ఏ చట్టం ప్రకారం ఇలాంటి పోస్టుల భర్తీ చేస్తున్నారో యాజమాన్యం చెప్పాలని డిమాండ్ చేశారు. పరంపర-2 పేరుతో చేస్తున్న పోస్టుల భర్తీలో రూ.లక్షలు చేతులు మారాయన్నారు. పోస్టుల భర్తీ అనేది కార్మిక చట్టాలకు లోబడి జరగాల్సి ఉందన్నారు. గతంలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ కార్మికులుగా నియమించారని గుర్తు చేశారు. మిల్లులో సుమారు 1100 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, వీరిలో 20 నుంచి 25 ఏళ్ల సీనియారిటీ కలిగిన వారు వందలమంది ఉన్నారన్నారు. వారికి విలువ లేనట్టు పరంపర స్కీమును యాజమాన్యం తీసుకొచ్చిందా అని ప్రశ్నించారు. దీనిపై యాజమాన్య ప్రతినిధి ముఖేష్ జైన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు కష్టాల్లో ఉంటే ఎందరో రాజకీయ నాయకులు అండగా నిలుస్తారని ఆ కోవలోనే జక్కంపూడి రాజా, శ్రీఘాకోళ్ళపు శివరామసుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి అప్పారావు వంటి వారు కార్మికుల పోరాటాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కార్మికులకు కాక అరాచకాలకు పాల్పడే ప్రవీణ్ చౌదరికి మద్దతుగా ఎవ్వరు నిలుస్తారని ప్రశ్నించారు. ఈ నెల 25న మిల్లు గేటు వద్ద ఎంపీ భరత్‌ను పిలిచి మీటింగు పెట్టి ఆ మరుక్షణమే మిల్లులోకి బయటకు వ్యక్తులను తీసుకుని వెళ్లి చిప్పర్ యూనిట్‌ను నిలుపుదల చేయడం వెనుక ఎవ్వరి ప్రోద్బలం ఉందో చెప్పాలన్నారు. ప్రవీణ్ చౌదరి వాస్తవానికి గుర్తింపు సంఘం నాయకుడే కాదన్నారు. అతని రెండేళ్ల కాల పరిమితి 2019లోనే ముగిసిపోయిందన్నారు. తిరిగి ఎన్నికల నిర్వహణకు డిసిఎల్ ప్రక్రియను ప్రారంభించారన్నారు. కోవిడ్ కారణంగా ఆటంకం ఏర్పడిరదని, ఈ తరుణంలోనే ప్రవీణ్ చౌదరి హైకోర్టులో రిట్ వేశారని తెలిపారు. అయితే ఎన్నికల నిలుపుదలకు కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. ప్రవీణ్‌చౌదరి పద్ధతిని మార్చుకోకపోతే కార్మికులే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు వెంకటేశ్వరరావు, ఐఎన్‌టియుసి నాయకులు దాస్, ఎస్‌డబ్ల్యుడబ్ల్యుఎ నాయకులు కె.రాజేష్, పిఎంఐయు నాయకులు, సిఎస్‌కె నాయకులు లంక అప్పారావు, టిఎన్‌టియుసి నాయకులు సుబ్బారావు, జెఎసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఉత్తీర్ణులకు హెచ్‌సిఎల్ ఇంటర్న్‌షిప్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇంటర్ విద్యార్హతతో హెచ్‌సిఎల్‌లో ఇంటర్న్‌షిప్‌తో కూడిన ద్యోగావకాశం కల్పిస్తున్నట్టు ఆర్ఐఒ జిజికె.నూకరాజు తెలిపారు. 2020-21, 2021-22కి సంబంధించి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి, 60 శాతం కంటే ఎక్కువ మార్కులు, మ్యాథ్స్ ఉన్న అభ్యర్థులకు ఈ ఇంటర్న్‌షిప్‌తో కూడిన జాబ్ గ్యారెంటీ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్న అనంతరం అప్లికేషన్‌లో అభ్యర్థి వివరాలు ఫోటో, ఆధార్ కార్డ్, సంతకం, 10వ తరగతి, ఇంటర్మీడియేట్ మార్కుల జాబితా అప్‌లోడ్ చేయాలన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు క్వాంటిటేటివ్-10 మార్కులు, లాజికల్ రీజనింగ్-10 మార్కులు, వెర్బల్-10 మార్కులపై ఆన్‌లైన్‌లో 30 నిమిషాల వ్యవధిలో ఆబ్జెక్టివ్ పరీక్ష, వ్యాసరచన నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణ ట్రైనింగ్ అనంతరం ఉద్యోగికి రూ.1.72 నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనంతో కంపెనీలో నేరుగా నియామకం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలు, పరీక్షల విధానాలపై వివరాలకు సూపరింటెండెంట్ జె. దశరథరామన్‌ను 7901271405 నెంబరులో, హెచ్‌సిఎల్ ప్రతినిధి అనిల్‌ను 8555085030లో నెంబరులో సంప్రదించవచ్చున్నారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న గొందేసి

గోదావరి పరిరక్షణ దీక్షకు గొందేసి మద్దతు

ప్రజాశక్తి-ధవళేశ్వరం

వైసిపి నేత నాయకులు టికె.విశ్వేశ్వర్ రెడ్డి చేస్తున్న గోదావరి పరిరక్షణ దీక్షకు గొందేసి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గొందేసి శ్రీనివాసులు రెడ్డి గురువారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం విశ్వేశ్వర్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని, వారి ఉద్యమ స్ఫూర్తి ఎందరినో మేలుకొలుపుతోందని చెప్పారు. ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా నిస్వార్థంగా ఆయన ఈ దీక్ష చేపట్టాని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాపునాడు యువత అధ్యక్షులు ముద్దాల అను, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు, వెలగదుర్రు, సత్యవాడ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నిడదవోలు ఎలక్ట్రికల్ డిఇ వీరభద్రరావు తెలిపారు. మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు స్కాలర్ అందజేత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ఆల్కట్ గార్డెన్స్‌కు చెందిన, గొందేశి గణపతిరెడ్డి వర్థంతి సందర్భంగా ఆయన కుమారుడు గొందేశి హరనాథ్ రెడ్డి ప్రతి ఏడాదిలాగే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. ఆల్కాట్ గార్డెన్స్‌లో ఉన్న శ్రీనివాస రామానుజ మున్సిపల్ హైస్కూల్లో కొంతమంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్కూల్స్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొందేశి మాధవీలత, సత్యవతి, చింతా చిట్టిబాబు, బొంతు ప్రసాద్, మట్టా గంగాధర్ పాల్గొన్నారు.

షష్టి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-బిక్కవోలు

ఈ నెల28న ప్రారంభమయ్యే సుబ్రహ్మణ్య స్వామి షష్టి ఏర్పాట్లను డిఎస్‌పి భక్తవత్సలం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సిఐ శ్రీనివాస్, ఎస్ఐ బుజ్జి బాబు, ఎఎంసి ఛైర్మన్ జెవివి.సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

మహిళకు పరామర్శ

ప్రజాశక్తి-గోపాలపురం

ఇటీవల పాము కాటుకు గురైన కొడమంచిలి శ్యామలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు గురువారం పరామర్శిచారు. ఆయన వెంట పార్టీ ద్వారాకాతిరుమల మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి దేవరపల్లి వీరాస్వామిచౌదరి, ప్రకాశరావుపాలెం ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు, సహదయ్ ఈలి శరత్‌బాబు, కొర్లపాటి రాము, మద్దిపాటి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, నందిన సుబ్రహ్మణ్యం, నూతంగి దొరబాబు, యంత్రప్రగడ మంగరావు, కూనపోం ప్రసాద్‌బాబు, గంగరాజు, వీరరాఘవులు ఉన్నారు.

ఎన్‌జిఒల సంఘం అధ్యక్షునిగా జోడాల


ప్రజాశక్తి-గోపాలపురం, తాళ్లపూడి



జోడాలను అభినందిస్తున్న నాయకులు

గోపాలపురం ఎన్‌జిఒల సంఘం ఎన్నికల్లో తాళ్లపూడి మండల ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు మూడోసారి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం సాగిస్తామన్నారు. సిపిఎస్ రద్దు తదితర సమస్యల పరిష్కార పోరాటంలో అందరూ కలిసి రావాలన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎన్‌జిఒల అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్ల అసోసియేట్ అధ్యక్షునిగా హరీష్, ఉపాధ్యక్షునిగా తారక రమేష్, వేదకుమారి, వీర్రాజు, కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా అనిల్ మరికొంతమంది ఇసి మెంబర్లుగా ఎన్నికయ్యారు. గోపాలపురం తాలూకా యూనిట్ ఎన్‌జిఒ అసోసియేషన్‌లో నూతనంగా ఏర్పడిన మహిళా విభాగానికి అధ్యక్షురాలుగా జివి.రమణ, కన్వీనర్‌గా జీవివి లక్ష్మి కో ఛైర్మన్‌గా సురేఖ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బివి.నాగేశ్వర రావు వ్యవహరించగా జిల్లా కార్యదర్శి ఎన్.రామారావు రాష్ట్ర జెఎసి సహాయ కార్యదర్శి జనరల్ ఆర్ఎస్ హరినాథ్

కార్టూ'నిజం'



రాజ్యాంగ పీఠిక క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రెస్ క్లబ్‌లో భారత రాజ్యాంగ పీఠిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంబేద్కరిస్టు ముంగమూరి చినబాబు రూపొందించిన క్యాలెండరును వైజాగ్‌కు చెందిన కెబిఆర్ అంబేద్కర్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం గురించి తెలుసుకోకుంటే రాజ్యాంగ విలువలను తెలియవని, రాజ్యాంగ విలువలను ప్రజలందరికీ తెలియచెప్పకపోవడం కొన్ని సంఘాల తప్పిదముందని కెబిఆర్ అంబేద్కర్ అన్నారు. హిందూమనువాద శక్తులు రాజ్యాంగం రద్దుకు ప్రయత్నిస్తున్నాయని, పాలకులు రాజ్యాంగాన్ని తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారని చెప్పారు. పీడిత జనుల హక్కుల కోసం పోరాడవలసిన అవసరం ఉందన్నారు. దీని కోసం జై అంబేద్కర్ భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజాగ్, తాడేపల్లిగూడెం, భీమవరంలో ఈ కార్యక్రమం నిర్వహించామని, ఈ నెల 26న భీమడోలులో జై అంబేద్కర్ భేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసకపట్ల రాంబాబు, పిల్లి అబ్బులు, గొల్లపల్లి వీరసత్యనారాయణ, నక్కా వెంకటరత్నం రాజు, సాకా సతీష్, షరీఫ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా రీసర్వే పనులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్వమిత్వ 'గ్రామకంఠం' రీసర్వే పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని, పంచాయితీ విద్యుత్ బిల్లులను 24 గంటలలో ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ డాక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ అమరావతి నుంచి స్వమిత్వ, స్వచ్ఛ సంకల్పం, ఉపాధి హామీ పథకం, జలజీవన్ మిషన్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుండి కలెక్టర్ కె.మాధవీలత, జెసి సిహెచ్.శ్రీధర్ పాల్గొన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ స్వమిత్వ సర్వేకు సంబంధించిన పనులను పకడ్బందీగా, వేగంగా చేయాలన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడానికి తీసుకువచ్చిన జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమం పటిష్టంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. పంచాయితీల కరెంట్ బకాయిలు గ్రామ పంచాయితీకి విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సత్వరమే విద్యుత్ శాఖ వారికి చెల్లించాలన్నారు. క్లాప్ మిత్ర గౌరవ వేతనాలను చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత గ్రామ పంచాయితీలదేనని, తప్పకుండా వాటికి సంబంధించిన బిల్లులను 24 గంటల్లోపు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి చెల్లింపుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జి.నరసింహులు, డిపిఒ పి.జగదాంబ, ఎస్ఇ వర ప్రసాద్, రిసోర్స్ పర్సన్ టి.సతీష్, స్వమిత్ర నోడల్ అధికారి కె.పద్మజ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం...

ప్రజాశక్తి-గోపాలపురం



గ్రామాల్లోని ప్రజా సమస్యలు అన్ని తప్పనిసరిగా పరిష్కరిస్తామని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గోపాలపురంలో 144వ రోజు బిసి కాలనీ, పెద్దగూడెంలో ప్రజా సమస్యలు తెలుసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇళ్ల నిర్మాణాలు త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఎస్‌సి కమ్యూనిటీ హాల్ శిథిలావస్థలో ఉండడంతో నూతన కమ్యూనిటీ హాల్‌కు త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతనం నాడు-నేడు పథకంలో స్కూలులో శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటి కె.లలిత, సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ పైడి శిరీష, సెక్రటరీ ఎస్.చినవెంకాయమ్మ, ఉప సర్పంచ్ ముల్లంగి శ్యామ్ సుందర్ రెడ్డి, ఇంజమూరి సుబ్బారావు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కె.ఖాదర్ వలీ వాలంటీర్లు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఉండ్రాజవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో గురువారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి 104 వాహన డాక్టర్ వెంకటేశ్వర్లు 80 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పి, టి.పూజ, శ్రీదుర్గ, ఎఎన్ఎం, ఆర్.సత్యవతి, బి.వెంకటరత్నం, సూపర్‌వైజర్ జి.వెంకట్రాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇటీవల అంబేద్కర్ కోనసీమ జిల్లా పసలపూడిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విజేతలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎఎస్‌పిలు ఎం.రజిని, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్ఇబి జెడి ఎ.రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి రజని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు, లక్ష్యాలను సాధించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి డి.రామవర్మ, ఎస్‌కెఆర్ ఉమెన్స్ కాలేజ్ పిఇటి సుధారాణి, మెగా కాలేజ్ డైరెక్టర్ సిహెచ్.గంగాధర్ చౌదరి, లాస్ట్ డేట్ స్కూల్ చిట్టి రాజు, మెగా కాలేజ్ లెక్చలర్ ప్రమోద్, సునంద స్కూల్ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల జారీకి ఆదేశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పత్రాల జారీని వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అమరావతి నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రీసర్వేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరు కార్యాలయ విసి హాల్ నుంచి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జెసి సిహెచ్.శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, చుక్కల భూములు, ఇన్‌కం సర్టిఫికెట్లు, కోర్టు కేసులో పురోగతి, తదితర అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా రీ సర్వే పనులు జరుగుతున్నాయని, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు దారులకు జగనన్న భూ హక్కు భూ రక్ష పత్రాల జారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు.



పాదయాత్రలో పాల్గొన్న నవీన్

6వ రోజుకు నవీన్ పాదయాత్ర

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పాదయాత్ర గోకవరం మండలంలో గురువారం 6వ రోజుకి చేరింది. బత్తుల సత్తిబాబు ఇంటి వద్ద ప్రారంభమైన యాత్ర గోకవరం టౌన్ డ్రైవర్స్ కాలనీ, టీచర్స్ కాలనీ సంజీవ్ నగర్‌లో సాగింది. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కులవృత్తులను ప్రోత్సహిస్తూ బిసిలకు ఆదరణ పథకం ఏర్పాటు చేశామని, వారికి తోపుడు బళ్లు, వాషింగ్ మిషన్లు సెలూన్ షాపులు వంటి అనేక రకాల వస్తువులు అందజేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఆదరణ పథకం ఎత్తివేసి బిసి కార్పొరేషన్‌ను విచ్ఛిన్నం చేసిందని, కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆఫీసులు లేకుండా కూర్చోవడానికి కుర్చీ లేకుండా బిసిలను అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎస్ అప్పల రాజు, మంగరౌతు రామకృష్ణ, కన్నబాబు, పాలూరి బోసు బాబు, కొమరం శ్రావణి, ఈది అశోక్, గునిపే భరత్, పోసిన ప్రసాద్, ఉంగరాల రాము, గుండా శివప్రసాద్, రాయవరపు శ్రీనివాసరావు, పులపర్తి బుజ్జి పాల్గొన్నారు.


కాకినాడ జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న చంటి పిల్లాడిని పరామర్శిస్తున్న గౌతమ్ రాజు

చిన్నారిని కాపాడుకుందాం..

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చంటి పిల్లాడిని కాపాడుకుందాం అని ప్రతి ఒక్కరు వాళ్లకు తోచినంత సహాయం చేయండని సినీనటుడు గౌతమ్ రాజు పిలుపునిచ్చారు. పెదపూడి గ్రామానికి చెందిన ఒక చంటి పిల్లాడు విద్యుత్ షాక్ గురై రెండు కాళ్లు పోగొట్టుకునే వరకు వచ్చిందని ఆ చంటి పిల్ల వాడిని కాపాడుకుందాం ప్రతి ఒక్కరూ చేయూతగా నిలబడదాం అని పెదపూడి ఎస్ఐ పి.వాసు వీడియో సోషల్ మీడియా వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం అవుతోంది. గురువారం ఆ వీడియోను పిఠాపురంలో ఆదిమూలం గంగాధర్ రావు సినీ హాస్యనటులు గౌతమ్ రాజు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన స్పందించి కాకినాడ జిజిహెచ్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాలుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం హాస్పిటల్ డాక్టర్లతోను సూపరింటెండెంట్ తోను మాట్లాడి ఆ చంటి బాలుడు కావలసిన మెరుగైన వైద్యం ఏర్పాటు చేయాలని ఆయన వాళ్లను కోరారు. ఈ సందర్భంగా సినీ హాస్యనటులు గౌతమ్ రాజ్ మాట్లాడుతూ ఈ చంటి పిల్లాడిని కాపాడుకుందాం అని ప్రతి ఒక్కరు వాళ్లకు తోచినంత సహాయం చేయండని కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో అమలుపరచేలా చేయాలని ఎంపిడిఒ కెవివి సత్యనారాయణ కోరారు. ఎంపిడిఒ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సంక్షేమ సహాయకులు మహిళ పోలీసులు వైద్య సిబ్బందితో సమావేశ నిర్వహించారు. నాడు నేడు పనులు జరిగే కార్యక్రమాల్లో అందరూ సమన్వయంతో పని చేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేయాలని దీనిని ప్రతి 15 రోజులకు ఒకసారి మహిళా పోలీసు తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పనులను తనతోపాటు ఏపి ఎం.అనిల్ కుమార్ పర్యవేక్షిస్తారన్నారు. ఎంపీడీవో ఇందిరాదేవి మాట్లాడుతూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, గృహ నిర్మాణాలను వెంటనే పనులు పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిబ్బంది కృషి చేయాలని ఆమె కోరారు. సచివాలయ సంక్షేమ సహాయకులు ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని పేదలకు అందించాలన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎఇ శ్రీనివాసరావు,. నాడు నేడు జెఇ శ్రీనివాస్, హెచ్ఎం సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే బోదవ్యాధి నివారణ

ప్రజాశక్తి - పెద్దాపురం

బోద వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నివారించవచ్చని పెద్దాపురం జాతీయ బోదవ్యాధి నివారణ కేంద్రం హెల్త్ ఇన్స్పెక్టర్ కె.వీరబాబు అన్నారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ బోధవ్యాధి గుర్తించబడిన వ్యాధిగ్రస్తులకు ప్రతి గురువారం ఈ కేంద్రం ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. పెద్దాపురం మండల పరిధిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో 346 మంది బోద వ్యాధిగ్రస్తులు ఉంటే మండల పరిధిలోని కట్టమూరులో 200 పైగా బోద వ్యాధిగ్రస్తులను గుర్తించామన్నారు. వీరందరికీ క్రమం తప్పకుండా మందులు అందజేస్తున్నా మన్నారు. దోమలు పెరగకుండా చర్యలు చేపడితే ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ప్రతి నెల ఒక మాస్ ఏరియాని ఎంపిక చేసుకుని ఆ ప్రాంతంలో 340 రక్త నమోనాలు సేకరించి పరీక్షలు జరుపుతు న్నామన్నారు. ఫైలేరియా అనుమానం ఉంటే బోధ నివారణ కేంద్రానికి వస్తే పరీక్షలు జరుపు తామన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక నగర పంచాయతీలో 7వ వార్డులో టిడిపి కాకినాడ అధికార ప్రతినిధి పైలబోస్ శంకుస్థాపన చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.34 లక్షల పార్కు, 6 లక్షలతో డ్రైనేజ్, 2 లక్షలతో రోడ్డు పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో ఆకుల బాబురావు, సురేష్, గెద్ద రామకృష్ణ, పైలా అయ్యప్ప, కల్లపల్లి శ్రీను, పైలా ప్రసాద్ ఉన్నారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఓటర్కార్డుతో ఆధార్ అనుసంధాన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్, కాకినాడ నియోజకవర్గ ఈఆర్ఓ కె.రమేష్ కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నగరంలోని ఏఈఆర్ఓలతో ఈ అంశంపై సమీక్షించారు. కాకినాడ నగరంలోని 233 పోలింగ్స్టేషన్ల పరిధిలో బూత్లెవెల్ అధికారులు ఓటర్ లిస్టు ప్రకారం అనుసంధాన ప్రక్రియ జరుగుతుందో లేదో పర్యవేక్షించాలని సూచించారు. జనవరి నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు కాకినాడ పరిధిలో సుమారు 61శాతం అనుసంధానం పూర్తయిందన్నారు వచ్చే ఏడాది జనవరి ఒకటవ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతను కూడా ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఆర్ఓలు వైహెచ్ఎస్ సతీష్, హరిదాస్, కోన శ్రీనివాస్, నాగాస్వప్నలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఆయన కౌలుకు సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రం లో గురువారం వరి కోత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. కౌలు రైతుల సమస్యను అనుభవ పూర్వకంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా తాను కౌలు సాగు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట ధర్మవరం సొసైటీ చైర్మన్ చెక్కపల్లి సత్తిబాబు, రామకుర్తి వెంకటరాజా ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-కరప

కరప మండలంలో గొర్రిపూడి ,వేళంగి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు శంకుస్థాపన చేశారు. గొర్రిపూడి గ్రామం మెరక పుంత, వంతెన వద్ద, సత్రం కాలువ వద్ద జల జీవన్ మిషన్ నిధులతో మంజూరు అయిన వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లలకు, మేడిశెట్టి వారి పేటలో రూ.5 లక్షలతోసి రోడ్డు, పల్లిపాలెం పుంతలో రూ.15 లక్షలతో సి.సిడ్రైన్లు ఎస్సీ పేటలో రూ.15 లక్షలతో సిమ్మెంటు రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. వేళంగిలోజల జీవన్ మిషన్ నిధులతో మంజూరు అయిన వాటర్ ట్యాంక్ నిర్మాణం మమ ఇంటింటికీ కుళాయి కనెక్షన్లలకుపనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీఎల్ సుబ్బారావు ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మీ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ రాజేష్, సిహెచ్ సుబ్బారావు, సిహెచ్ అప్పలరాజు సాన శ్రీను గారగ జిమ్మీ కె.బీమశంకర్, నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పలువురికి జ్యోతుల పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన మాజీ గండేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కందిరెల్ల బుచ్చయ్య ఇటీవలే మతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు అనంతరం జడ్.రాగంపేట గ్రామానికి చెందిన బొడ్డు సత్యనారాయణ ఇటీవల కిడ్నీ సమస్యతో మృతిచెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, మురారి గ్రామ టిడిపి అధ్యక్షులు సుంకవిల్లి రాజు, గోరిజాల వెంకన్న దొర, కె. నాయకంపల్లి మాజీ సర్పంచ్ కొండలరావు, ఉండవల్లి బుల్లి రాజు, ఉండవల్లి శ్రీను, జాస్తి చిన్నబాబు, క్లస్టర్ ఇంచార్జ్ బొల్లం రెడ్డి రామకష్ణ, ఉండవల్లి ప్రసాద్, ఆత్కూరి రామచంద్రరావు పాల్గొన్నారు.

పనితీరు మారకుంటే చర్యలు తప్పవు

-శానిటరీ ఇన్స్పెక్టర్లకు కమిషనర్ హెచ్చరిక

ప్రజాశక్తి- కాకినాడ

పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ స్పష్టం చేశారు. ఎంహెచ్ఓ డాక్టర్ పథ్వీ చరణ్ తో కలిసి గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శానిటరీ ఇన్స్పెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనేక ప్రాంతాల నుంచి శానిటరీ ఇన్స్పెక్టర్ల పర్యవేక్షణా లోపంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొన్నిచోట్ల సచివాలయ కార్య దర్శులపై బాధ్యతలు వదిలిపెట్టి కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దష్టికి వచ్చిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఫిర్యాదులు, ఆరోపణలకు ఆస్కారం లేకుండా పనితీరు మెరుగుపరు చుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఇకపై పారిశుధ్యంపై తాను ప్రత్యేక పర్యవేక్షణ చేస్తానని, ఎలాంటి లోపం కనిపించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కాకినాడ రామకృష్ణారావుపేట ప్రాంతంలో కమిషనర్ రమేష్ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆ ప్రాంతంలో ఒక టీ దుకాణం యజమాని డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోకుండా టీ గ్లాసులను రోడ్డు పక్కనే వేయడానికి గుర్తిం చారు. మరోసారి ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. స్థానికంగా రోడ్డు పక్కన చెత్త వేయడాన్ని గుర్తించి అక్కడి శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇచ్చారు. గురు వారం కాకినాడ నగరపాలక సంస్థ ఆదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మూడో సర్కిల్ పరిధిలోని కొత్త కాకినాడలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తడి-పొడి చెత్తను ప్రజలు వేరువేరుగా ఇస్తున్నారో లేదో పరిశీలించారు. ఇంటింటికి చెత్త సేకరణ జరుగుతున్న తీరును కూడా ఏ డి సి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాలలో చెత్తను రోడ్ల పక్కన వేయడాన్ని గుర్తించారు. రాత్రి సమయాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఆ చెత్తను వేస్తున్నట్లు పారిశుధ్య సిబ్బంది చెప్పారు. అటువంటి వారిని గుర్తించి గట్టిగా హెచ్చరించాలని, వినకపోతే జరిమానా విధించడంతోపాటు చర్యలు కూడా తీసుకోవాలని ఆయన అక్కడి శానిటరీ ఇన్స్పెక్టర్ రవివర్మ ను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ రవివర్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


సాయిరామకృష్ణను సత్కరిస్తున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య, ఉపాధ్యాయులు

సాయి రామకృష్ణకు ఆచార్య అరుణాచల స్మారక పురస్కారం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రతిష్టాత్మక మైన ఆచార్య పివి అరుణాచలం స్మారక పురస్కారం 2022 అవార్డు గ్రహీత స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణకు ఇవ్వడంతో ఆయన గణిత ప్రతిభ కు మరింత ప్రోత్సాహం ఇచ్చినట్లు అయిందని సామర్లకోట మండల విద్యా శాఖ అధికారి వై.శివరామకష్ణ అన్నారు. ఈ సందర్భంగా సాయిరామకృష్ణను పాఠశాల పేరెంట్స్ కమిటీ, స్కూల్ టీచర్ల ఆధ్వర్యంలో సామర్లకోట ఎంఇఒ వై శివరామకృష్ణయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ చంద లాడ శ్రీని వాసరావు, సప్ప ఆదినారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

27న బాలమందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆరేళ్ళు పూర్తిచేసుకుని సప్తమ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 27వతేదీ ఆదివారం బాలమందిరం సప్తమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ట్రస్టు కన్వీనర్ అంగర గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సందర్భంగా నిర్వహించే సభకు గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అధ్యక్షత వహిస్తారని, ఆర్జేడి విద్యాశాఖ డి మధుసూదనరావు, కాకినాడ జిల్లా డిఇఒ దాట్ల సుభద్ర, కాకినాడ డివైఇవో ఆర్ జే డెనియల్ రాజు, సామర్లకోట ఎంఇఒ వై శివరామకృష్ణయ్య, యుటీఎఫ్ రాష్ట్ర నాయకులు జి ప్రభాకర వర్మ, నాయకులు తోలెం లోవరాజు, సానా నాగేశ్వరరావులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

నూరు శాతం ఆన్లైన్ చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

జగనన్న విద్యా కానుక లబ్ధిదారులందరికీ నూరు శాతం ఆన్లైన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ అండ్ ఐ ఈ కోఆర్డి నేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. గురువారం ఆయన పెద్దాపురం ఎంఇఒ కార్యా లయాన్ని సందర్శించి జగనన్న విద్యా కానుక లబ్ధిదారుల రికార్డులన్నీ పరిశీలించి, సిఆర్పిల పని విధానాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ సత్య నారాయణ, కార్యాలయ సిబ్బంది, సిఆర్పిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ స్మార్ట్ సిటీ రోడ్లు విస్తరణలో భాగంగా పోల్స్ షిఫ్టింగ్ పనుల నిర్వహిస్తున్న కారణంగా అన్నమ్మఘాటి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో, వాటర్ వర్క్స్ ఫీడర్ల పరిధిలో ఈ నెల 25వ తేదీ ఉదయం 8.30 గంట నుంచి నుండి 12.30 గంటల వరకు 33/11కెవి విద్యుత్ సరఫరా నిలుపు దల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ కాకినాడ డివిజన్ ఎఇ జి.ప్రసాద్ తెలి పారు. అన్నమ్మఘాటి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గల ఘాటీ సెంటర్, ముగ్గుపేట, రెల్లిపేట, గాయత్రి నగర్, గణేష్ నగర్, భానువారి వీధి, బొంతువారి వీధి, మహాలక్ష్మి పేట, సత్యవేద కాలనీ, మేకనారాయణమ్మ తోట, బాపూజీ నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఎఇ తెలిపారు. **యు.కొత్తపల్లిల** మండలంలో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎఇ జీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లో కొత్తగా ఏర్పాటు చేయడం కారణంగా మూలపేట, పొన్నాడ, రామన్నపాలెం, అమరవల్లి, శీలవారిపాకలు, నాగు లపల్లి, ఎండపల్లి, కొండవరం, సొంటివారిపాకలు, కోనపాప పేటలలోఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటన్న వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

అమలాపురంలో...

అమలాపురం బాలయోగి ఘాట్ సబ్స్టేషన్లో విద్యుత్ లైన్ల మార్పు నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని విద్యుత్ శాఖ డిఇ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాను చేసిన యాక్సిడెంట్ కారణంగా ప్రమాదానికి గురైన వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేయడంతో ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకోలేక భయపడి ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని చివటం గ్రామానికి చెందిన వెలగన సంతోష్ శనివారం రాత్రి తణుకు-ఉండ్రాజవరం సరిహద్దుల్లో తణుకు రోడ్డుపై పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం తణుకు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాల్దారి గ్రామానికి చెందిన చీపుళ్ల గోపీమోహనకృష్ణ అనే వ్యక్తి సంతోష్ చేసిన ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రమాదానికి గురైన సమయంలో సంతోష్ వద్ద నుంచి రూ.500 తీసుకున్నాడు. అనంతరం మరో రూ.మూడు వేలు తీసుకున్నాడు. 19 తేదీ రాత్రి సంతోష్కు ఫోన్ చేసి మరో రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే పోలీసు కేసు అవుతుందని భయపడిన యువకుడు ఆ విషయంత తల్లిదండ్రులకు చెప్పుకోలేక యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై సంతోష్ తండ్రి మహేశ్వర రావు తణుకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గోకవరం హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం జెడ్పి పాఠశాలలో హెచ్ఎం ఎం.చిమ్మరాజు దొర ఆధ్వర్యంలో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాఠశాల పిఎంసి చైర్మన్ కణితి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిమ్మరాజు దొర మాట్లాడుతూ ఈ నెల నవంబర్ 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పాఠశాల స్థాయిలో ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సైన్స్, గణితంలో అనేక అంశాల్లో సుమారు 100 ప్రాజెక్టును మోడల్స్ వివిధ తరగతి విద్యార్థుల నుండి తయారు చేసి ప్రదర్శించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిఎంసి కమిటీ సభ్యులు మద్దాల లక్ష్మణరావు దాసరి లక్ష్మి ప్రగాఢ నాగమణి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపిపికి బాలోత్సవ కమిటీ ఆహ్వానం

ప్రజాశక్తి -దేవరపల్లి

ఎంపిపి కుప్పాల వెంకట కనక దుర్గారావును దేవరపల్లి బాలోత్సవ కమిటీ సభ్యులు గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బాలోత్సవం జయప్రదానికి సహకరించవలసిందిగా కోరారు. బాలోత్సవం విజయవంతం కావడానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎంపిపి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశ రావు, ఉపాధ్యక్షులు ఉండవల్లి కృష్ణారావు, పప్పు వెంకట రామారావు, పచ్చ రామగోపాల్, కాట్రు భీమరాజు, వెలగా శ్రీనివాసరావు, నలమాటి రామారావు పాల్గొన్నారు.

నిధుల కోసం హెచ్పి గ్యాస్ కంపెనీకి వినతి

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలాభివృద్ధి కార్యక్రమాలపై మిత్ర ఫౌండేషన్ ద్వారా హెచ్పి గ్యాస్ నిధులు కేటాయించాలని గోకవరం ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు, హెచ్పి గ్యాస్ కంపెనీ మేనేజర్కు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మిత్ర ఫౌండేషన్ ద్వారా గోకవరం మండలంలో ప్రతి గ్రామానికీ బోర్వెల్స్, డ్రైనేజీ సిస్టం, మంచినీటి సదుపాయంతో పాటు మహిళా యువతకు టైలరింగ్ సెంటర్స్ యువకుల కోసం కంప్యూటర్ శిక్షణతో పాటు ఉన్నత ఉద్యోగాలపై అవగాహన కల్పించాలని లిఖితపూర్వక వినతిపత్రం అందజేశామని తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ పాలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతితో పాటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగిస్తోందని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని వేగేశ్వరపురంలో గురువారం నిర్వహించిన గడపగడపకూ వైసిపి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన మంత్రి వనిత సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రి వనితకు గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎంపిటిసి రాయపాటి లక్ష్మణరావు పూలబొకేతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ పోసిన శ్రీలేఖ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లంక రోడ్ల పనులు పూర్తి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంకకు చెందిన పొలాలకు వెళ్లే పుంత రోడ్లను ఆరు కిలోమీటర్ల మేర గ్రావెల్ రహదారులుగా అభివృద్ధి చేశామని సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, ఆమె భర్త వైసిపి సీనియర్ నేత దూలం సత్తిబాబు తెలిపారు. ఈ ఏడాది వరదలకు రోడ్లన్నీ కోతకు గురయ్యాయి. నడవడానికి కూడా అవకాశం లేని విధంగా మారాయి. పంట ఉత్పత్తులను ఇదే దారిగుండా తరలిస్తూ పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయాన్ని రైతులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్ తన భర్తతో కలిసి ఎంఎల్ఎ చిర్లను కలిశారు. ఆయన ఆదేశాల మేరకు పుంత రోడ్లను అభివృద్ధి చేశామని సర్పంచ్ దంపతులు తెలిపారు. కార్యదర్శి యు.సుప్రియ, నాయకులు పి.తాతాజీ, కె.గంగరాజు, కె.నాగిరెడ్డి, వి.శ్రీధర్, కె.కుమార్ పర్యవేక్షణలో వీటిని పూర్తి చేశామని తెలిపారు.

పశువైద్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురంలో నిర్మించిన పశువైద్యశాలను ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. పశువుల వైద్యం కోసం సంచార వాహనాలు ఏర్పాటు చేసిందన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బోనం సాయిబాబా, ఎంపిపి కె.అన్నపూర్ణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, తహశీల్దార్ అనిల్కుమార్, పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాస్, పశు వైద్యాధికారి సుబ్బారావు నాయకులు ముదునూరి రామరాజు, కనుమూరి శ్రీనివాసరాజు, కప్పల శ్రీధర్, పోచిరాజు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు రూ.67.93 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ .67,93,142 నగదు, 30 గ్రాముల బంగారం, 887 గ్రాముల వెండి సమకూరింది. గురువారం ఆలయ ముఖమండపంలో పలివెల ఉమా కొప్పేశ్వర స్వామివారి దేవస్థానం ఇఒ ప్రసాద్రాజు పర్యవేక్షణలో 29 రోజులు కాలానికి సంబంధించిన హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు రమేష్రాజు, ఇఒ సత్యనారాయణ రాజు, సర్పంచ్ బాబూరావు, సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.భాను తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రౌతులపూడి

ఏపీ సీఎం కప్ కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలకు ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సహ కారంతో ఈ నెల 26 న శంఖవరం జడ్పి ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ఎం.గోవిందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీయువకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను. పాసుపోర్టు సైజ్ ఫోటోను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాన్నారు.

రావులపాలెం ఎస్ఐగా వెంకటరమణ

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెం ఎస్ఐగా పెద్దాపురం పట్టణానికి చెందిన మడికి వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. రావులపాలెం పోలీస్ స్టేషన్లో దాదాపు నాలుగు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సురేంద్ర ఇన్ఛార్జిగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తున్న మడికి వెంకట రమణను రావులపాలెం ఎస్ఐగా నియమితులయ్యారు. ఆయనను పలువురు అభినందించారు.

యువతులను వీడియో తీసిన వ్యక్తిపై కేసు

ఆత్రేయపురం : ఇద్దరు యువతులు గదిలో దుస్తులు మార్చుకున్న సమయంలో వీడియోలు తీసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 13న వన సమారాధన కోసం కొంత మంది యువతులు లొల్ల లాకుల వద్దకు వచ్చారు. ఇరిగేషన్ కార్యాలయంలో దుస్తులు మార్చుకొంటున్న సమయంలో ఇరిగేషన్ శాఖలో అవుట్ సోర్సింగ్ లస్కర్గా పనిచేస్తున్న విప్పర్తి గంగాధర్ సెల్ఫోన్తో వీడియో తీశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక బాలయోగి పేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన పాలంగి వెంకన్న కుటుంబానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందించారు. ఆయన వెంట కె.శ్రీనివాస్, బి.జయలక్ష్మి, వి.మారుతి, పి.ఆశీర్వాదం, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాడిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మూడు నెలలుగా విద్యుత్ బకాయి చెల్లించడం లేదని కోళ్ల గ్రామంలోని రెస్టారెంట్ యజమాని వద్దకు వెళ్లిన విద్యుత్ సిబ్బందిపై దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెస్టారెంట్ కనకాల వెంకటేశ్వరరావు మూడు నెలలుగా విద్యుత్ బిల్లు చెల్లించలేదు.

అమరులను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

మాలల అభ్యున్నతికి అండగా నిలబడిన అలుపెరగని పోరాటం చేసి అమరులైన ఎస్సి ప్రజా ప్రతినిధులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తొండవరానికి చెందిన ఎస్సి నాయకులు వెన్నపు రాంబాబు పేర్కొన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమలాపురం ఎర్రవంతెన సమీపంలో నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

26న మాలల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవ పర్వదినాన ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్ రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన సమనస, రంగాపురం గ్రామాల్లోని యువజన సంఘాలను కలిశారు. వన సమారాధనలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఉడుము రామకృష్ణ, రేవు శ్రీను, అంబేద్కర్ జిల్లా సాధన సమితి నాయకులు ములపర్తి సత్యనారాయణ, జల్లి శ్రీను, ముత్తాబతుల రమణ, కొక్కోటి వినోద్, సిద్ధార్థ యూత్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.